# ఊరు అంటుకుంది

—కొంపెల్ల విశ్వం

ఆంధ్ర దేశమంతటా ఎండలతో మండి పోతున్న రోజుల్లో—

ఒక పూరిలో, ఒక పేటలో ఇళ్ళంటుకున్నాయి

"నిప్పు! నిప్పు!!"

మంటలు - మంటలు!!"

"ఫైరింజనుకి ఫోను చేయండి."

"ఊఁ, ఆ కఱ్ఱ తీసుకుని కొట్టు మంట మీద"

"అయ్యయ్యో, పక్కిల్లు కూడా అంటుకుంటోంది"—ఇవన్నీ కేకలు, అరుపులు. రకరకాల మనుషులు చేసే ఆర్తనాదాలు. గొంతులు వేరైనా అవి పలికేది ఒక్కటే.

ఆ పేటలోవి మేడలు కావు, మిద్దెలు కావు. సామాన్యులు నివసించే ఘంటమూరు పెంకుటిళ్లు కావు పాకలు, గుడిసెలు, పూరి గుడిసెలు.

సమాజంలో జరుగుతున్న అన్యాయానికి ఎంతకాలం నుంచో మండుతున్న వారి గుండెల్లాగే ఆ గుడిసెలు మండుతున్నాయి. వాటి నెలా ఆర్పడమనేది అక్కడున్న అందరి ఆవేదనా.

ప్రతి ఇంటిలోను దాచుకున్న కుండలు, బిందెలు, చెంబులలో వున్న నీళ్ళు తీసుకొచ్చి ఆ మంటల మీద పోస్తున్నారు. ఆ నీళ్ళు నిప్పునేమీ చేయలేక పోతున్నాయి. నీళ్ళను సైతం నిప్పు కాల్చేస్తోంది.

ప్రక్కనున్న ఇల్లు అంటుకోగానే గోవిందయ్య ఇల్లు ఖాళీ చేసి దూరంగా నించుని మంట నెలా ఆర్పాలో హడావిడి పడుతుంటే, గోవిందయ్య తన కూతురు పెళ్ళి కోసం కొన్న ఇత్తడి బిందె ఎవరో పట్టుకు పోయారని గోవిందయ్య పెళ్ళాం గోల పెడుతుంది.

ఒకరిద్దరు ముసలమ్మలు ఆ ఊరినే దహించివేస్తున్న నిప్పును సైతం దేవునిగా భావించి, "అగ్ని దేవుడికి కోపం వచ్చింద"నుకుంటూ ఎలాగోలాగ ఇంత పెరుగన్నం తెచ్చి మంటలో పడేస్తున్నారు.

దొంగ పోయాక వచ్చిన పోలీసుల్లాగ, ఆ పేట సగానికి పైగా కాలిపోయాక ఫైరింజను లొచ్చాయి. అలవాటుగ జనం వాటిని తిట్టారు.

"మమ్మల్ని తిట్టి ప్రయోజన మేమిటి? కొత్తపేటలో ఇంతకన్నా ఘోరమైన అగ్ని

ప్రమాదం జరిగితే అక్కడి కెనాల్ రిజర్వ్‌లో వున్న నీరంతా అక్కడే అయిపోయింది. నీళ్లెక్కడున్నాయో చూపించండి" అంటూ దిక్కులు చూశారు ప్రభుత్వ అగ్నిమాపక దళం వారు.

వారం దిక్కుమొహం వేయటం చూసి గట్టిగా నవ్వుతోంది గాలి. గాలి నవ్వు చూసి మరింతగా మండుతోంది నిప్పు.

గాలి నవ్వుతోంది. నిప్పు మండుతోంది.

ఆ చుట్టుపక్క లెక్కడా నీళ్ళు లేవు. కాని నీళ్లున్నాయి, అక్కడున్న అందరి కళ్ళలోనూ.

నిశ్చలంగా వున్న నీటిలో రాయి వేస్తే నీరంతా కదులుతుంది. ఊరిలో ఒక్క ఇల్లంటుకుంటే చాలు. ఆ ఊరంతా అంటుకుంటుంది ఏదో ఒక రూపంగా.

అందుకనే - అదే సమయంలో ..

పక్కవీధిలోని పెద్దమనుషులు. గోవిందయ్య ఆధ్వర్యాన "అగ్నిబాధితుల సహాయ సంఘం" నెలకొల్పారు.

* * *

ఇవి జరిగిన నాలుగు నెలలకు -

"అగ్నిబాధితుల సహాయసంఘం" ముఖ్య సభ్యులు. గోవిందయ్యా కలిసి తమ తమ జేబుల్లో సరిపడక బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన డబ్బు ఇరవై వేలు.



## గ్రహణం

అంబరానా సంచరించే
సంబరాల చందమామా!
అమర జ్యోతివి నీవు
ఆనంద దీపికవు

గగనానా వున్న నీకు
గ్రహణం పట్టిందని
గమ్యం లేని ఈ జాతి
దిగ్భ్రమ చెందుతూంది.

మంత్రాలు పఠిస్తూంది
ఉపవాసా లుంటూంది
కట్టుకథల కబుర్లతో
నిట్టూర్పులు విడుస్తూంది

మానవత్వం మంటగలిసినా
దానవత్వం చెలరేగుతున్నా
కరుడు గట్టిన సమాజానికి
విరుగుడు కరువై పోతున్నా —

అవినీతి. స్వార్థం
అధికారం, అహంకారం
సగటు మనిషి జీవితాన్ని
'సహారా'గా మారుస్తున్నా —

హత్యలూ, దోపిడీలు
విచ్చలవిడిగా జరుగుతున్నా
అభాగినుల శీలాలకు
బేరాలు సాగుతున్నా —

కబళించే ఈ గ్రహణం
కనిపించదు ఈ జాతికి
కనులు తెరచి గాంచలేదు
ఈ జనత ఏనాటికి

నీ గ్రహణం అతి స్వల్పం
మా గ్రహణం సుదీర్ఘం
నీ గ్రహణం తీరింది
మా గ్రహణం యిక వీడదు.

— సుజాతా సుదర్శన్